# 'మహా' జాతరకు ఏర్పాట్లు పూర్తి



## 2.30 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు     నేటి నుండి జాతర ఉత్సవాలు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర వేడుకలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. లక్షలాది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో కె. వినోద్ రెడ్డి తెలిపారు. జాతర నిర్వహణ కోసం రూ.2కోట్ల 30 లక్షలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేసినట్లు ఈవో పేర్కొన్నారు. ఉత్సవాలకు సుమారు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. నేడు సాయంత్రం 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, 7:30 గంటలకు టీటీడీ తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. శివరాత్రికి వచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 700లకు పైగా ప్రత్యేక బస్సులను కేటాయించారు. ఆలయ పరిసరాలతో పాటు పట్టణంలో ప్రత్యేక వైద్య శిబిరాలను, అంబులెన్స్ లను ఏర్పాటు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో సుమారు పోలీసులు సిబ్బంది జాతర బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం జాతరను పర్యవేక్షించనున్నారు. భక్తులు, విఐపీల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. 25, 26 తేదీల్లో ఆలయంలో నిరంతర దర్శనం కల్పించినట్లు వివరించారు. శివరాత్రి రోజున సాయంత్రం 6:05 గంటలకు ఆలయంలో మహా లింగార్చన, రాత్రి 11-35 నిమిషాలకు లింగోద్భవ సమయాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం నిరంతరం దర్శనం కొనసాగుతుందని ఈవో తెలిపారు. ప్రతి ఏటా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గుడి చెరువు స్థలంలో నిర్వహించే శివార్చన కార్యక్రమాన్ని ఈ సారి కూడా ఘనంగా ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి జాతర నేపథ్యంలో వేములవాడలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



















## మెరుగైన వసతులు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, వేములవాడ: రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మహాశివత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి రాజరాజేశ్వర దేవస్థానంలో అన్నదాన సత్రం,రాజన్న జల ప్రసాదాన్ని పరిశీలించారు. అన్నదాన సత్రంలో వంట గది పరిశీలించారు. భక్తులను వారి యోగక్షేమాలు, అన్నం కూరలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.. జల ప్రసాదం వద్ద ఓపెన్ డ్రైన్ ను పూడ్చాలని సూచించారు.. ఆలయ పరిసరాల్లో శానిటేషన్ ఎప్పటికప్పటికప్పుడు చేయాలని తెలిపారు.. అనంతరం బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు.



## జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**ప్రజానావ, సిరిసిల్ల :** మంగళ, బుధవారాల్లో జరుగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను సోమవారం సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. వేలాదిమందిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దేవాలయ పరిసర ప్రాంతాలను, దర్శన ప్రదేశాలు, ధర్మగుండం,శివర్చన జరుగు ప్రదేశం,వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్ ప్రదేశాలను సందర్శించారు. ట్రాఫిక్ డైవర్షన్స్, వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ వీరప్రసాద్, ఆలయ ఈఓ వినోద్, ఈఈ రాజేష్, డీఈ మైపాల్ రెడ్డి, ఏఈ రామ్ కిషన్ రావు, ఏఈఓలు శ్రవణ్ కుమార్, అశోక్ కుమార్, ఆలయ సిబ్బంది ఉన్నారు.



